క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆర్లకుంట తండాలో నేనావత్ లక్ష్మణ్‌నాయక్ (63) బుధవారం మృతిచెందాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హేంలాల్, ఎస్ఎస్‌యూవి మండల అధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచ్ ఈశ్వర్, శ్రీరామ్, శ్రీను, పాండు, వస్య తదితరులు పాల్గొన్నారు.

18న సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల మండలాధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

పోలింగ్ సరళిపై ఆరా..

ఆమనగల్లు బీఆర్ఎస్ నాయకులతో ఆర్ఎస్పీ చిట్‌చాట్



బీఆర్ఎస్ నాయకులతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డా.ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఆ పార్టీ నేతలు కలిశారు. గత కొన్ని నెలలుగా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అచ్చంపేట వెళ్తూ ఆమనగల్లు పట్టణంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులతో ఆర్ఎస్పీ కాసేపు ముచ్చటించారు. మండలంలో పోలింగ్ సరళి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో తనకోసం పనిచేసిన నాయకులను ఆర్ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, స్థానిక నాయకులు వెంకటేష్, రమేశ్‌నాయక్, జగన్, సతీష్, రమేష్ నాయక్, గణేశ్, ఆనంద్, యాదగిరి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గంతో ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామ కమిటీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీను, నర్సింహ, కార్యదర్శులుగా జంగయ్య, రమేష్, కోశాధికారులుగా మాధవరెడ్డి, రవీంద్రచారి, గౌరవ అధ్యక్షులుగా వనపర్తి కృష్ణస్వామి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, సీ.శ్రీనివాసులు, సలహాదారులుగా కృష్ణయ్య, బక్కయ్య, నర్సింహ, యాదయ్య, రామచంద్రయ్య, యాదయ్య, కృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా.. మల్లేశ్, దర్శన్‌రెడ్డి,అనంతరెడ్డి, పరంధాములు, సోషల్ మీడియా కన్వీనర్‌గా రవీందర్,భానుప్రకాశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఎస్సీసెల్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాములు, మహేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు డోకూరి ప్రభాకర్ రెడ్డి ధ్రువపత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

మొయినాబాద్‌రూరల్: యువత అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అంబేడ్కర్ కన్‌స్ట్రక్షన్ సంఘం మండల చైర్మన్ మాల యాదయ్య అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు ఆ సంఘం ఆధ్వర్యంలో యాదయ్య డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్య, ఉద్యోగంతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. క్రీడలు శారీరక ధారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రికెట్ ఆర్గనైజేషన్ సభ్యుడు నవీన్ ఆధ్వర్యంలో 18 మంది క్రీడాకారులకు మాల యాదయ్య డ్రెస్‌లు పంపిణీ చేశారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వపరంగా కూడా స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లేమో ఇలా.. ప్రయాణం ఎలా?

- మంచాలలో మరమ్మతులకు నోచుకోని లింకురోడ్లు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



తవ్వి వదిలేసిన ఆరుట్ల రోడ్డు

మంచాల: లింకు రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన మూల్యం చెల్లించుకోక తప్పదు. వివరాలు.. మంచాల మండలంలోని లింకురోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రధానంగా ఆరుట్లకు వచ్చే చాంద్‌ఖాన్‌గూడ-బుగ్గతండా రోడ్డు, ఆరుట్ల-తిప్పాయిగూడ రోడ్డు, కాగజ్‌ఘాట్-మంచాల వయా జాపాల రోడ్లు కంకరతేలి, గుంతలుపడి ప్రమాదకరంగా మారాయి.

చాంద్‌ఖాన్‌గూడ- బుగ్గతండా రోడ్డు

ఈ రోడ్డు జాపాల, రంగాపూర్, అస్మత్‌పూర్, ఆగాపల్లి నుంచి ఆరుట్లకు చేరుకునే ప్రధాన రోడ్డు. గతంలో వేసిన బీటీ రోడ్డు ఎక్కడికక్కడ గోతులు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఏడాదిన్నర క్రితం రోడ్డు బాగుచేస్తామని తవ్వి అలాగే వదిలేశారు.దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు.

కాగజ్‌ఘాట్-మంచాల రోడ్డు

మంచాల మండల కేంద్రానికి చేరుకునేందుకు ఇదే ప్రధాన రోడ్డు. మరమ్మతులకు నోచుకోకపోవడంతో జాపాల నుంచి మంచాల వరకు గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై రాత్రిపూట ప్రయాణం కష్టంగా మారింది. ఈ రోడ్డులో చాలా మలుపులు ఉండటం, గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆగాపల్లి నుంచి మంచాల వరకు రోడ్డును బాగుచేసేందుకు గతంలో ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. ఈ క్రమంలో కేవలం ఆగాపల్లి నుంచి కాగజ్‌ఘాట్ సమీపంలోని శ్రీవెంచర్ వరకు రోడ్డువేసి వదిలేశారు. మిగతా రోడ్డు కూడా పూర్తిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరుట్ల-తిప్పాయిగూడ రోడ్డు

ఇది రంగారెడ్డి-యాదాద్రి రెండు జిల్లాలను కలిసే సరిహద్దు రోడ్డు. ఆరుట్ల నుంచి కడీలబావి తండా మీదుగా తిప్పాయిగూడ చేరుకోవడానికి సులువైన మార్గం. ఈ రోడ్డు మీద కంకర తేలడంతో పాటు పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాత్రిపూట ప్రయాణించలేని పరిస్థితి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రాణాలను చేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఈ లింకు రోడ్లను తక్షణమే బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన ఆరుట్ల-చాంద్‌ఖాన్‌గూడ రోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్లు పాడైపోవడంతో వాహనదారులకు, ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా మారింది. ఆరుట్ల రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు రిపేర్‌కు గురవడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని లింకు రోడ్ల కు మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

– శేఖర్, ఆరుట్ల

మరమ్మతులు చేయిస్తాం

లింకు రోడ్లు మరమ్మతులకు గురైన విషయం మా దృష్టికి వచ్చింది. ఆయా లింకు రోడ్ల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. అనుమతలు మంజూరైన వెంటనే నెలరోజుల్లోపు పనులు ప్రారంభిస్తాం. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం.

– సాయినాథ్ గౌడ్, ఏఈ, పంచాయతీరాజ్

ప్రభుత్వ కళాశాలలో చేరండి

ప్రిన్సిపాల్ తిరుపతయ్య

మంచాల: మంచి భవిష్యత్ కోసం విద్యార్థులు మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య కోరారు. బుధవారం మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఆరుట్ల, మంచాల తదితర గ్రామాల్లో ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు అన్నిరకాల వసతులు కల్పిస్తోందన్నారు. మంచాల కళాశాల ఫలితాలను పరిశీలన చేసి మీ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. నాణ్యమైన విద్యను అందించి మంచి భవిష్యత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

మంచిరెడ్డిని కలిసిన నాయకులు

తుర్కయంజాల్: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం కలిశారు. వారితో పోలింగ్ సరళిపై చర్చించినట్లు మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, చిన్నయ్య, వినోద్, పాండు, శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.



మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో బీఆర్ఎస్ నాయకులు

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: లోక్‌సభ ఎన్నికలు ముగిసిన దృష్ట్యా ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ కొప్పు సుకన్య కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో తాగునీటి సమస్యలు, నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులు, మొక్కల సంరక్షణ, ఉపాధి కూలీలకు చేతి నిండా పనులు, ధాన్యం కొనుగోళ్లు, వర్షాలు కురిస్తే రైతాంగానికి అవసరమైన ఎరువులు, విత్తనాల నిల్వలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేకాధికారులు నిత్యం గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.



ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సబ్‌స్టేషన్ పనుల్లో వేగం పెంచండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో ఏర్పాటు చేస్తున్న 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. చేగూరులో నిర్మాణంలో ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని, కొన్ని పనులకు సంబంధించి స్థానికుల నుంచి మెటీరియల్ తీసుకొని డబ్బులు కూడా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసినట్లయితే నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు.

నర్సప్పగూడకు 24 గంటల విద్యుత్..

నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న నర్సప్పగూడకు 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. దీంతో నందిగామ, కొత్తూరు ఫీడర్‌కు ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి చేగూరు ఫీడర్‌కు విద్యుత్ కనెక్షన్‌ను కలపాలని అందుకుగాను అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. దీంతో నర్సప్పగూడకు త్వరలో 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, ఏడీఏ రవీందర్, నందిగామ ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, రవీందర్, వీరేందర్‌గౌడ్, బుచ్చయ్య, శ్రీశైలం, బాల్‌రాజ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండుగలకు ప్రాధాన్యం

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా అన్ని పండుగలకు ప్రాధాన్యతనిస్తుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని ఫాతీమాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫాతీమామాత(చర్చి) పుణ్యక్షేత్రం వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులకు పాస్టర్లు ఆశీర్వచనలు అందజేశారు. నిత్య ప్రార్థనలు, ఆధ్యాత్మికత అలవర్చుకుంటే శాంతియుత సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని వివరించారు. అంతేకాకుండా ఆపదలో ఉన్నవారికి సాయం చేసే గుణాన్ని అలవార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్డినల్ పూల అంథోని, నల్లగొండ బిషప్ దమన్‌కుమార్, చర్చి పాస్టర్ సైమన్‌రెడ్డి, కౌన్సిల్ మెంబర్లు దిలిప్ రెడ్డి, మర్రెడ్డి, వినయ్‌రెడ్డి, చార్లెస్‌రెడ్డి, జయపాల్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాగారెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సర్వత్రా ఉత్కంఠ

- పట్నంలో లోక్‌సభ ఎన్నికలపై జోరుగా చర్చ
- విజయం ఎవరిని వరిస్తుందోనని వాదోపవాదనలు
- అభ్యర్థులకు అంతుచిక్కని ఓటరునాడి



మొండిగౌరెల్లిలో ఓటు వేసిన యువకులు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ముగియడంతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎక్కడ.. ఎవ్వరిని కదలించినా, నలుగురు కలిసినా.. లోక్‌సభ ఎన్నికల అంశంపై చర్చించుకుంటున్నారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గెలుపోటములపై చర్చ రసవత్తరంగా సాగుతోంది. కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోరుసాగిందనే అంశం ప్రధానంగా తెరపైకి వస్తోంది. ఏ మాత్రం పట్టులేని ఈ నియోజకవర్గంలో ప్రధాని మోదీ చరిష్మా బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు కలిసొచ్చిన అంశంగా జనాలు మాట్లాడుకుంటున్నారు. రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ ఉండటం, ఈ నియోజకవర్గంలో పార్టీకి కేడర్‌తో పాటు గట్టి పట్టుండటం ఆ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయానికి ఢోకాలేదని ఆ పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ స్థానికుడు కావడంతో నియోజకవర్గంపై కొంత ప్రభావం చూపుతాడని భావిస్తున్నారు. బీఆర్ఎస్ శ్రేణులంతా కలిసికట్టుగా పార్టీ అభ్యర్థి విజయానికి కృషిచేయలేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోరు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మండలాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గంలోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలో 3,39,341 ఓటర్లుండగా 2,26,790 మంది(66.83 శాతం) లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యాచారం మండల పరిధిలో 48,656 ఓట్లకుగాను 35,446 మంది (72.85 శాతం), మంచాల మండల పరిధిలో 40,029 ఓటర్లకుగాను 31,347 మంది (78.31 శాతం), ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 72,468 ఓటర్లకుగాను 52,691 మంది(72.71 శాతం), అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో 1,78,188 మంది ఓటర్లుండగా 1,07,306 మంది(60.22 శాతం) ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 35 మంది ట్రాన్స్ జెండర్లుండగా ఏడుగురు ఓటేశారు. గెలుపుపై కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు బయటకు ధీమాను వ్యక్తం చేస్తున్నా... లోలోపల ఆందోళనకు గురౌతున్నట్లు తెలుస్తుంది. ఈ టెన్షన్‌కు తెరపడాలంటే ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే వరకు ఓపిక పట్టాల్సిందే అని చర్చ జోరుగా జరుగుతోంది.

పెళ్లి కానుక అందజేత

మొయినాబాద్: ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లుగానే స్థానిక నాయకులు గ్రామాల్లో పథకాలను ప్రవేశపెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తమ సొంత పథకాలను అమలు చేస్తున్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి మాజీ సర్పంచ్ రత్నం ఇటీవల 'పెళ్లి కానుక' పథకానికి శ్రీకారం చుట్టి ఆడపడుచుల వివాహానికి రూ.10,116 కానుకగా అందజేస్తున్నారు.అందులో భాగంగా గ్రామానికి చెందిన జంగయ్య కూతురు మాధవి వివాహం బుధవారం జరగడంతో ఆమె వివాహానికిరత్నం హాజరై రూ.10,116 పెళ్లి కానుక అందజేసి వధూవరులను ఆశీర్వదించారు.

పొంచిఉన్న ప్రమాదం

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న ఎయిర్‌వాల్వ్‌తో ప్రమాదం పొంచి ఉంది. ఎయిర్‌వాల్వ్‌కు పైకప్పు బిగించకుండా ఓపెన్‌గా ఉండటంతో వాహనదారులు దానిలో పడే అవకాశం ఉంది. దీంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. అటుగా వెళ్లే బాటసారులు సైతం భయపడాల్సిన పరిస్థితి ఉంది. ఎలాంటి ప్రమాదాలు జరుగకముందే అధికారులు తక్షణమే పై కప్పు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.



నక్కర్తమేడిపల్లి రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ఎయిర్‌వాల్వ్

మొక్కల సంరక్షణకు చర్యలు

- ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి
- కమిషనర్ రఘు
- ట్యాంకర్ల ద్వారా నీటి తడులు

బడంగ్‌పేట్: తీవ్రమైన ఎండలు, వడగాల్పులు, ఉక్కపోతల మధ్య ఇండ్లలో ఉండలేని పరిస్థితి. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ప్రజలు సేద తీరడానికి కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందుకనుగుణంగా పార్కులో ఉన్న మొక్కలను పెంచి సంరక్షిస్తుంది. కార్పొరేషన్ పరిధిలో మొక్కలను పెంచే కార్యక్రమం చేపట్టింది. రోడ్డుమధ్య ఖాళీ స్థలం, రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటించి ట్యాంకర్ల ద్వారా నీటిని పోయిస్తున్నారు. మొక్కలు విరివిగా ఉండడంతో కాలుష్యం తగ్గడమే కాకుండా స్వచ్ఛమైన గాలి నిస్తుందని నిపుణులు చెబుతున్న విషయమే. దీని కనుగుణంగా ప్రతిఒక్కరూ మొక్కలు పెంచితే భవిష్యత్‌లో ఎండ వేడిమి తగ్గడమే కాకుండా కాలుష్యాన్ని తగ్గిస్తుందని పలువురు చెబుతున్నారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. తదనుగుణంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులు పచ్చదనం లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే నాటిన ప్రతీ మొక్క ఏపుగా పెరిగి ప్రకృతిలో భాగమైపోతుంది. చల్లని గాలితో పాటు నీడనిస్తుంది. కాబట్టి ప్రాణవాయువు అందించే మొక్కలను బ్రతికించుకోవడం విధిగా భావించాలి. మొక్కల పెంపకం ధ్యేయంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నడుం బిగించింది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ కమాన్ నుంచి జిల్లా లైబ్రరీ వరకు రోడ్డు వెడల్పు చేసి సెంట్రల్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్య పాయింట్లలోమొక్కలు నాటిస్తున్నారు. అందులో భాగంగానే మొక్కలు నాటి వాటికోసం ఎరువులతో పాటు ఎర్ర మట్టి పోసి నీటిని పోస్తున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో మొక్కలకు నీరందక ఎండిపోతున్నాయి. దీన్ని గమనించిన అధికారులు వాటర్ ట్యాంకర్లతో నీటిని పోయించి పెంచుతున్నారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను, సిబ్బందిని ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ట్యాంకర్‌తో మొక్కలకు నీరు పోస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

నందనవనాన్ని తలపించేలా..

ఆహ్లాదంగా షాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ



పచ్చదనంతో కళకళలాడుతున్న కార్యాలయ ఆవరణ



కార్యాలయ ఆవరణలో మామిడి చెట్లు

షాబాద్: షాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతోంది. వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగి ప్రజలకు నీడతో పాటు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కార్యాలయ ఆవరణలో గత ఎనిమిది సంవత్సరాల క్రితం హరిత హారం కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల మొక్కలు నాటారు. అప్పటి ఎంపీడీఓ పద్మావతి ప్రత్యేక శ్రద్ధ వహించి సిబ్బందితో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు పోయించారు. దీంతో నాటిన మొక్కలన్నీ ఏపుగా పెరిగి వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే మండల ప్రజలకు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కొన్ని మొక్కలు చక్కని ఫలాలను కూడా ఇస్తున్నాయి. కార్యాలయంలో గత నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి నాటిన మామిడి మొక్క ప్రస్తుతం ప్రజలకు మామిడికాయలు అందిస్తోంది.